సాక్షి
పెద్దపల్లి

బుధవారం । 29 । మార్చి । 2023



బల్దియాలో విజిలెన్స్ భయం

రామగుండం నగరపాలక సంస్థలోని పలు విభాగాల అధికారులకు విజిలెన్స్ భయం పట్టుకుంది.

8లో▸



అభివృద్ధిలో దేశానికే ఆదర్శం

సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలు స్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
37.0/24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం విపరీతమైన ఉక్కబోతగా ఉంటుంది.

రమజాన్ అంటే స్నేహం. నేనున్నానని చెప్పడం, నువ్వున్నావని గుర్తుచేసుకోవడం.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
బుధ: 6:32	గురు: 4:47

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

జేఎన్టీయూలో బీజోన్ స్థాయి క్రికెట్ పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్

రామగిరి(మంథని): సెంటినరీకాలనీలోని జేఎన్టీయూలో ఈనెల 31 నుంచి బీజోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. వర్సిటీలోని తన చాంబర్‌లో టోర్నమెంట్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. బీజోన్ పరిధిలోని ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలోని ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల జట్లు పోటీల్లో పాల్గొంటాయని, పూర్వ క్రీడాకారుల ఆర్థిక సహాయంతో ఉచిత భోజనం, వసతి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి మ్యాచ్‌కు మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్, ప్రాతినిధ్య, ప్రతిభ సర్టిఫికెట్లతోపాటు విజేతలకు బహుమతులు ఉంటాయని వివరించారు. ఈఈఈ విభాగం అధిపతి దుర్గారావ్, డీఈఈ సతీశ్, సూపరింటెండెంట్ రవికుమార్, ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ

పెద్దపల్లిరూరల్: ఇటీవలి కాలంలో గుండెపోటుతో మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయని, గుండెపోటుకు గురైనవారికి సత్వరమే సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడే అవకాశముందని డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్‌తో ప్రాణాలు రక్షించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సీపీఆర్ చేసే విధానంపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. మూడునెలల కాలంలో ఆరువేల మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, త్వరలోనే పూర్తి చేస్తామని వివరించారు.

ఏకగ్రీవంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గం



కలెక్టర్‌తో రెడ్‌క్రాస్‌సొసైటీ కార్యవర్గం



రాజ్‌గోపాల్

పెద్దపల్లిరూరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైందని ఎన్నికల అధికారి మైఖేల్‌బోస్ తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీకి ఎన్నిక ప్రారంభించగా పదవులకు ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. జిల్లా చైర్మన్‌గా కావేటి రాజ్‌గోపాల్ రెండోసారి ఎన్నికయ్యారు. వైస్‌చైర్మన్‌గా తూము రవీందర్, సెక్రటరీగా సాదుల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా వీరగోని శ్రీనివాస్, స్టేట్ ఎంసీ సభ్యులుగా ఎరబాటి వెంకటేశ్వర్‌రావు, సభ్యులుగా అంజన్‌కుమార్, డీవీఎస్.మూర్తి, వెంకటేశ్, శ్రీకాంత్ ఎన్నికైనట్లు వివరించారు. నూతన కార్యవర్గాన్ని కలెక్టర్ సంగీత, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్ అభినందించారు.

పరిజ్ఞానం ఉంటేనే ప్రాధాన్యత

జ్యోతినగర్: మార్పులకు అనుగుణంగా పరిజ్ఞానం పెంచుకుంటేనే ప్రాధన్యత ఉంటుందని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాల్‌లో హెచ్‌ఆర్ విభాగం కార్పొరేట్ కమ్యూనికేషన్ సెల్ ఆధ్వర్యంలో తెలంగాణ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడారు. ప్రతి ఉద్యోగి కార్పొరేట్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను కలిగి ఉండేందుకు ముందుకు సాగాలని కోరారు. సంస్థ మాజీ జీఎం రవీంద్రన్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. సీజీఎం ప్రసేంజిత్ పాల్, జనరల్ మేనేజర్లు పుష్పేంద్రకుమార్ లాఢ్ ఉన్నారు.

పంచాయతీరాజ్‌లో టీఎస్‌పీఎస్సీ తరహా కుంభకోణం

- 1988లో కట్టా చేరే సమయంలో ఫోర్జరీ సంతకాలు
- సర్వీస్ రికార్డులో ఒక్కో పేజీకి ఒక్కో అధికారి సంతకం
- అంతర్గత సిబ్బందే అతనికి సాయం చేశారని సందేహాలు
- తప్పుడు విధానంలో చేరారంటూ నిగ్గుతేల్చిన నివేదిక
- త్వరలోనే వేటు ఖాయమంటున్న సహోద్యోగులు

పట్టుకోండి చూద్దాం పార్ట్ 6




కట్టా విష్ణువర్ధన్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కట్టా విష్ణువర్ధన్ అలియాస్ వాసు.. పంచాయతీరాజ్ విభాగంలో ప్రస్తుతం ఏఈగా కొనసాగుతున్న ఈ ఉద్యోగి నియామకం, విద్యార్హతల విషయంలో ఆయన అందరినీ తప్పుదోవ పట్టించారని ఇంతకాలం అనుకున్నారు. కానీ.. అతని సర్వీసు రికార్డులు చూస్తే.. కట్టా విష్ణువర్ధన్ ఇదంతా బయట నుంచి ఒక్కరే చేయలేదనిపిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్న టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీల తరహాలోనే అతనికి పంచాయతీరాజ్ విభాగంలోని కొందరు సిబ్బంది సహకరించారన్న విషయం సర్వీసు రికార్డు చూస్తే అర్థం అవుతోంది. నేటి హైటెక్ యుగంలో ఉద్యోగ నియామకాల్లో అనేక అవకతవకలు వెలుగు చూస్తున్నాయి. కానీ.. ఎలాంటి టెక్నాలజీ లేని రోజుల్లోనే కట్టా విష్ణువర్ధన్ చాలా తెలివిగా తన సర్వీసు రికార్డులో అధికారుల సంతకాల ఫోర్జరీకి వ్యూహం రచించారని అతని సహోద్యోగులు కొత్త సందేహాలను లేవనెత్తుతున్నారు.

ఏం జరిగింది?

కట్టా విష్ణువర్ధన్ ఉరఫ్ వాసు వివాదం మరోసారి వార్తల్లోకెక్కింది. పంచాయతీ రాజ్ విభాగం వద్ద ఉన్న సమాచారం ప్రకారం.. కరీంనగర్ సబ్–డివిజన్, ఏఈ, విష్ణువర్ధన్ మార్చి2, 1967లో జన్మించారు. ఆయన తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ టీచర్లే. 1987లో తండ్రి వెంకట నాగరత్నాచారి మరణించారు. తన తల్లి ప్రభుత్వ టీచరు అన్న విషయాన్ని దాచి 1988లో కారుణ్య నియామకం కింద పంచాయతీరాజ్‌లో అప్పటి ఉమ్మడి జిల్లాలోని మహదేవాపూర్‌లో గ్రేడ్–3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా చేరారు. వాస్తవానికి 1984లోనే కట్టా నిరూప ప్రభుత్వ టీచర్‌గా నియమితులయ్యారు. కరీంనగర్ డీఈవో కార్యాలయంలో ఆమె పుట్టిన తేదీ ఫిబ్రవరి 01, 1956గా ఉంది. విచిత్రంగా విష్ణువర్ధన్ తన పదో తరగతి సర్టిఫికెట్లలో మార్చి 2, 1967లో జన్మించినట్లు పేర్కొన్నారు. తల్లి కంటే కేవలం పదేళ్లు చిన్నవాడైన ఉద్యోగిగా అరుదైన రికార్డును తనపేరిట లిఖించుకున్నాడు. అదే సమయంలో గ్రేడ్–3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఉమ్మడి జిల్లాలోని మహదేవాపూర్‌లో చేరారు. ఈ విషయం తన సర్వీసు రికార్డులోని అతని చేరికను ధ్రువీకరిస్తూ అతనిపై అధికారి తొలిపేజీలో చేసిన సంతకాన్ని చూసి చెప్పొచ్చు. రెండో పేజీలోనూ అదే అధికారి సంతకం ఉండాలి. కానీ, మరో సబ్ డివిజన్ సుల్తానాబాద్‌కు చెందిన డీఈ సంతకం ఉండటంతో ఈ వివాదం సరికొత్త మలుపు తిరిగింది. నిబంధనల ప్రకారం.. రెండు పేజీల్లోనూ ఒకే అధికారి సంతకం, స్టాంప్ ఉండాలి. ఇక్కడ వేర్వేరు సబ్‌డివిజన్లకు చెందిన డీఈల సంతకాలు ఉన్నాయి. దీన్ని ఉన్నతాధికారులు ఎలా ఆమోదించారో అని మిగిలిన సిబ్బంది ముక్కున వేలేసుకుంటున్నారు.



ఎస్‌ఆర్‌లో ఫోర్జరీగా చెబుతున్న సంతకం

ఆ సంతకం నాది కాదు

విష్ణువర్ధన్ విద్యార్హతల వివాదం చాలాకాలంగా కొనసాగుతోంది. ఆయన తన సర్వీసులో ఏనాడూ నా వద్ద పనిచేయలేదు. కానీ.. అతని సర్వీసు రికార్డు బుక్‌లో నా సంతకం ఉండటం ఆశ్చర్యానికి గురిచేసింది. నూటికి నూరుపాళ్లు అది నా సంతకం కానే కాదు.

– రవి కుమార్, విశ్రాంత పీఆర్ ఇంజినీర్

రెండు సంతకాలు, రెండు స్టాంపులు..

- ఇక్కడ మరో ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. రెండో పేజీలో డీఈ రవికుమార్ సంతకం, సుల్తానాబాద్ సబ్ డివిజన్ స్టాంప్ ఉంది. అదే సమయంలో మరో అధికారి సంతకం, జగిత్యాల సబ్‌డివిజన్ స్టాంప్ ఉంది. ఇంకా పరిశీలించి చూస్తే.. వీటి అడుగున వేములవాడ సబ్ డివిజన్ స్టాంప్ కూడా ఉంది. మొత్తానికి రెండు సంతకాలు మూడు స్టాంపులతో రెండో పేజీని అత్యంత గందరగోళంగా ఉంది. ఈ లెక్కన చూస్తుంటే.. ఈ సంతకాలను ఫోర్జరీ చేసి ఉంటారని, దీనికి సూత్రధారి విష్ణువర్ధన్ అయి ఉంటాడని సహోద్యోగులు అనుమానిస్తున్నారు. తప్పుడు దారిలో కొలువు సాధించి, అనుమానాస్పద విద్యార్హతలతో ఉద్యోగం చేస్తున్న కట్టాకు ఫోర్జరీలు పెద్ద విషయమేమీ కాదని ఆరోపిస్తున్నారు. ఈ లెక్కన అతని నియామకం సమయంలో కొందరు కీలక ఉద్యోగులు విష్ణువర్ధన్‌కు సహకరించారని తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సర్వీసు రికార్డును ఇంతకాలం వీసమెత్తు అనుమానం రాకుండా ఉందని విమర్శిస్తున్నారు.

వేపకు ఆపద..!



నిలువునా ఎండిపోతున్న వేప చెట్లు

- శిలీంధ్రం సోకి చనిపోతున్న చెట్లు
- బాధ్యతగా కాపాడుకోవాలి అంటున్న సర్కారు
- చర్యలకు వెనుకడుగు వేస్తున్న స్థానిక సంస్థలు
- ప్రమాదంలో పడిన చెట్ల మనుగడ

మానవాళికి ఎంతో ఉపయోగపడే వేపచెట్లు ఎక్కడికక్కడే ఎండిపోతున్నాయి. చిగుర్లు, లేత కొమ్మలు, ఆకులు ఎర్రగా మారి రాలిపోతున్నాయి. పూత, కాత కుళ్లిపోతూ కొద్దిరోజుల్లోనే చనిపోతున్నాయి. ఫలితంగా వేపపుల్ల, వేపపువ్వు కోసం ఆందోళన మొదలైంది. రెండేళ్లుగా వేపచెట్లు ఎండిపోవడమో లేక కూలిపోవడమో జరుగుతుండగా.. కొద్దిరోజులుగా తీవ్రంగా కనిపిస్తోంది. దీనికి కారణమైన తెగులును గుర్తించి.. వేపచెట్లను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సాక్షి, పెద్దపల్లి: సర్వరోగ నివారణి.. మనిషికి ప్రాణవాయువు అందిస్తూ.. నీడనిచ్చే వేపచెట్ల మనుగడ ప్రమాదంలో పడింది. జిల్లాలోని పలుప్రాంతాల్లో పెద్ద ఎత్తున 'పోమోప్సిస్ అజాడిరిక్టే' అనే శిలీంధ్రం సోకి 'డై బ్యాక్ వ్యాధితో' చనిపోతున్నాయని కొందరు.. 'ట్రీ మస్కిటో బగ్' వల్లనేనని మరికొందరు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం చెట్లను సామాజిక బాధ్యతగా కాపాడుకోవాలని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు ముందుకొచ్చి వేపచెట్టుకు జీవం పోసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చింది. జిల్లాలో మాత్రం ఆయా పక్షాల నుంచి స్పందన కొరవడింది. వేపచెట్లు డైబ్యాక్ వ్యాధితో ఎండిపోతున్నాయనే విషయం తెలిసినా ఎవరి దృష్టికి తీసుకెళ్లాలనే దానిపై గ్రామీణ ప్రజల్లో సందిగ్ధం నెలకొంది. వ్యవసాయశాఖ అధికారులకు చెబితే తమ పరిధిలోకి రాదంటున్నారు. అటవీశాఖ అధికారులు మాత్రం ఉన్నతాధికారులకు నివేదిస్తామంటున్నారు తప్ప కార్యాచరణ రూపొందించటం లేదు. మంత్రాల నెపంతోనే చెట్లు ఎండుతున్నాయని కొన్ని సందర్భాల్లో గ్రామాల్లో గొడవలు సైతం చోటుచేసుకుంటున్నాయి. అధికార యంత్రాంగం వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

నివారణ చర్యలు ఇలా..

సమస్యను గుర్తించిన వెంటనే చెట్టును మొత్తం కొట్టేయకుండా, సదరు కొమ్మను నరికివేయడం ద్వారా మిగతా శాఖలకు వ్యాపించకుండా కాపాడవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చెట్టుకు ఎక్కువ నీరు పోయడం, గోరింటాకు కలిపిన నీటిని పోయడం ద్వారా వైరస్‌ను తగ్గించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. కార్బెండిజిమ్ (బావిస్టాన్) మందును లీటరు నీటికి రెండు గ్రాములు కలిపి చెట్టు మొదలు పూర్తిగా తడిచేలా పోయాలి. వేర్లు, కాండం మొదలుపై ఉండే శిలీంధ్రాన్ని ఈ మందు అరికడుతుంది. అనంతరం ఏడు రోజుల తర్వాత థయోఫనేట్ మిథైల్ రెండు గ్రాముల మందు లీటరు నీటిలో కలిపి చెట్టు మొదలు పూర్తిగా తడిచేలా పోయాలి.

పరిశోధనలు జరుగుతున్నాయి

వేపచెట్లు జిల్లాతో పాటు చాలా ప్రాంతాల్లో ఎండిపోతున్నాయి. దానికి సంబంధించి శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. శిలీంధ్రం ఆశించడం మూలంగా వేపచెట్లు ఈ విధంగా ఎండుతున్నాయని ప్రాథమికంగా గుర్తించాం. మూఢనమ్మకాలు నమ్మవద్దు.

– డాక్టర్ వెంకన్న, కేవీకే శాస్త్రవేత్త

సింగరేణి మెడికల్ కాలేజీగా మార్చాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్
- కార్మికుని పాదాలకు క్షీరాభిషేకం



కార్మికుని పాదాలకు అభిషేకం చేస్తున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: రామగుండంలోని వైద్య కళాశాలకు సింగరేణి మెడికల్ కాలేజీగా పేరు పెట్టాలని, కార్మికుల పిల్లలకు ప్రత్యేక కోటా కేటాయించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ డిమాండ్ చేశారు. జీడీకే–2ఏ గనిలో గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి కార్మికులు చెమటోడ్చగా వచ్చిన రూ.500కోట్లు కళాశాలకు కేటాయించారంటూ కార్మికుడి పాదాలకు క్షీరాభిషేకం చేశారు. సింగరేణికి రావాల్సిన సీఎస్‌ఆర్ నిధులు రూ.1600 కోట్లు దారి మళ్లిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఓసీపీ–5 బ్లాస్టింగ్‌లతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. కాల్వ లింగస్వామి, మాదరబోయిన రవికుమార్, మారెల్లి రాజిరెడ్డి, బొమ్మక రాజేశ్, ముస్తాఫా, చుక్కల శ్రీనివాస్, రవి యాదవ్, గట్ల రమేశ్, గడ్డం శేఖర్, తిప్పారపు శ్రీనివాస్ ఉన్నారు.

గిరిజనులకు భూమి ఇస్తామని మోసం

అధికారంలోకొస్తే దళిత, గిరిజనులకు మూడెకరాలు ఇస్తామని రాష్ట్రప్రభుత్వం మోసం చేసిందని రాజ్‌ఠాగూర్ విమర్శించారు. హాథ్‌సేహాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా మార్కండేయకాలనీలో పర్యటించారు. నిరుద్యోగ భృతి ఇస్తామని అమలు చేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 5లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు.

కుల రాజకీయాలు శ్రీధర్ బాబుకు వెన్నతో పెట్టిన విద్య



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కుల రాజకీయాలు చేయడం వెన్నతో పెట్టిన విద్య అని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంగళవారం తన నివాసంలో మాట్లాడారు. ఖానాపూర్‌లో మంథని మధూకర్ మృతి చెందితే కాపు సామాజికవర్గానికి చెందిన వి.హన్మంతరావు, దానం నాగేందర్‌ను తీసుకొచ్చి ధర్నా చేయించారని పేర్కొన్నారు. మంథనితో సంబంధం లేని కేంద్ర మాజీమంత్రి శివశంకర్ సంస్మరణ సభను మంథనిలో నిర్వహించి మున్నూరుకాపులను మోసం చేశాడన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం శివశంకర్ పేరిట స్కాలర్‌షిప్ ఇస్తానని చెప్పిన ఆయన ఎంత మందికి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో 80శాతం పైబడి ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లోని పేదలను 40 ఏళ్లుగా ఆ కుటుంబం మోసం చేస్తూనే ఉందన్నారు. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

యువతకు స్వయం ఉపాధి చూపాలి



బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలను అందించాలని కలెక్టర్ సంగీత బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో మంగళవారం బ్యాంకర్లతో సమావేశమయ్యారు. ఇప్పటివరకు 76 యూనిట్లకు రూ.1,450కోట్ల రుణాలు అందించి 470మందికి ఉపాధి కల్పించామని, ముద్ర రుణాల కింద రూ.11,371 మందికి రూ.70.34 కోట్ల రుణాలు పంపిణీ చేశామని బ్యాంకర్లు వివరించారు. స్వశక్తి సంఘాల మహిళలకు రుణాలందిస్తున్నామని, కొన్ని సంఘాల సభ్యులు తిరిగి చెల్లించడం లేదని, వసూలుకు నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డెయిరీని ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో లీడ్‌బ్యాంకు మేనేజర్ వెంకటేశ్, డీఆర్‌డీఓ శ్రీధర్, ఉద్యాన అధికారి జగన్మోహన్‌రెడ్డి, వివిధ బ్యాంకు శాఖల మేనేజర్లు పాల్గొన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ శ్రావణ్

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లోని సీహెచ్‌సీ (ప్రస్తుతం వైద్య విధాన పరిషత్)ని మంగళవారం డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ శ్రావణ్, కాయకల్ప బృందం సభ్యురాలు రాజ్యలక్ష్మీ సందర్శించారు. వార్డులు, డెలివరీ రూమ్, పరిశుభ్రత, బయో మెడికల్ నిర్వహణ, రికార్డులను పరిశీలించారు. మహిళలు ప్రసవం అయ్యాక స్టెరిలైజేషన్ చేస్తున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లేబర్ రూమ్ నిర్వహణ రోజుకు ఎన్నిసార్లు చేస్తున్నారని పారిశుద్ధ్య కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ వార్డును సందర్శించి వివరాలు సేకరించారు. పరిశీలించిన ప్రతి అంశాన్ని రాష్ట్ర వైద్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌కు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీడీఓ రమాదేవి, డాక్టర్లు శ్రీరామ్, మహేందర్, సునీత, సాత్విక, తనూజ, రామ్మోహన్, శ్రీధర్, స్టాఫ్‌నర్సులు నర్సమ్మ, రేవతి, సునీత, సరిత, కనకధార, సిబ్బంది శ్రీనివాసాచారి, అమర్, నరేశ్ ఉన్నారు.

గోదాములో 'విజిలెన్స్' తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..



గోదాములో తనిఖీలు చేస్తున్న సివిల్ సప్లై, విజిలెన్స్ అధికారులు

సుల్తానాబాద్ : చౌకధరల దుకాణాలకు పంపిణీ చేసే మండలకేంద్రంలోని బియ్యం గోదాములో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈనెల 13న ‘సాక్షి’ బియ్యం తరుగు శీర్షికన కథనం ప్రచురించిన విషయం తెల్సిందే. దీనికి స్పందించిన అధికారులు ఈ తనిఖీలు చేశారు. సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాలకు నెలవారీగా ఈ గోదాం నుంచే సరుకులు పంపిణీ చేస్తారు. అయితే పలువురు రేషన్ డీలర్లు తమకు బియ్యం తక్కువగా వస్తున్నాయని, గోదాం నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేయడంతోపాటు సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. అధికారులు వస్తున్నారని సమాచారం మేరకు అందులో పనిచేసే తాత్కాలిక ఉద్యోగి సెల్‌ఫోన్లు అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని, సరఫరా చేసిన బియ్యం, నిల్వ ఉన్న బియ్యంలో తేడాను ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐలు వరుణ్ ప్రసాద్, అనిల్, తహసీల్దార్ దినేష్, ఎస్సై నారాయణ బాబు, కానిస్టేబుల్, సివిల్ సప్లై అధికారులు ఉన్నారు.

రెండు లారీల బియ్యం మాయం

సుల్తానాబాద్ గోదాం నుంచి రెండు లారీలు బియ్యం మాయమైనట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. గతనెలలో ఉన్న బియ్యం, ఈనెల వచ్చిన స్టాక్‌ను పరిశీలించగా.. 750 క్వింటాళ్ల తేడా వచ్చినట్లు వివరించారు. తాత్కాలిక ఉద్యోగి పరారీలో ఉన్నాడని తెలిపారు. విజిలెన్స్ ఎస్పీ ప్రభాకర్ గోదామును పరిశీలించారు. సివిల్ సప్లై ఇన్‌చార్జి డీఎం వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ డీఎం నర్సింహారెడ్డికి విజిలెన్స్ అధికారులు పంచనామా కాపీని అందించారు.

వార్షిక లక్ష్యం చేరుకున్న ఎన్టీపీసీ

- 15,831 మి.యూనిట్ల ఉత్పత్తి

జ్యోతినగర్: రామగుండం ఎన్టీపీసీ సంస్థ 2022–23 ఆర్థిక సంవత్సరం మూడురోజుల ముందుగానే నిర్దేశిత వార్షిక లక్ష్యాన్ని అధిగమించింది. 2600 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులో 15,750 మి.యూ ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించగా.. మూడురోజుల ముందుగానే 15,831 మి.యూ ఉత్పత్తిని 70.28 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్‌ఎఫ్)తో పూర్తిచేసింది. 2600 మెగావాట్ల పరిశ్రమలో ప్రస్తుతం 49.88 శాతం ఫ్రీక్వెన్సీతో 2,435 మెగావాట్లు ఉత్పత్తి అవుతున్నట్లు సమాచారం.

యూనిట్ల వారిగా విద్యుత్ ఉత్పత్తి వివరాలు..

200 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల మొదటి యూనిట్‌లో 202, రెండో యూనిట్ 192, మూడో యూనిట్‌లో 160తోపాటు 500 మెగావాట్ల సామర్థ్యం గల నాలుగో యూనిట్‌లో 456, ఐదో యూనిట్‌లో 460, ఆరో యూనిట్‌లో 479, ఏడో యూనిట్‌లో 486 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. మొత్తంగా 2600 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులో 2,435 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతున్నట్లు సమాచారం.







హమ్మయ్యా.. పరీక్షలు ముగిశాయోచ్..!

జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. దీంతో విద్యార్థులు 'హమ్మయ్యా పరీక్షలు ముగిశాయి..' అంటూ ఇంటిదారి పట్టారు. మంగళవారం నాటి పరీక్షకు 5,543 మంది హాజరుకావాల్సి ఉండగా 5,252 మంది హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి కల్పన తెలిపారు. – పెద్దపల్లిరూరల్

క్లుప్తంగా

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వెంకన్న


వెంకన్న

రామగిరి(మంథని): సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న ఆకుల వెంకన్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. విద్యార్థి దశలో 1978 నుంచి పీడీఎస్‌యూలో పని చేస్తూ 1991లో రామగుండం ఎరువుల కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేశారు. ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షుడిగా ఈ ప్రాంతంలోని ఎన్టీపీసీ, బసంత్‌నగర్, పెద్దపల్లి ఇటుక బట్టీల, క్వారీల కార్మికులను ఆర్గనైజ్ చేస్తూ 2003 నుంచి సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల హక్కులు, సౌకర్యాల కల్పనకు రాజీలేని పోరాటాలు చేశారు.

ఉపాధిహామీ ఏపీవో, టీఏ సస్పెన్షన్

ఓదెల(పెద్దపల్లి): మండలంలో ఉపాధిహామీ పథకంలో పనిచేసే ఏపీవో కొమురయ్య, టెక్నికల్ అసిస్టెంట్ లీలలను సస్పెండ్ చేస్తూ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్‌లు అవినీతి అక్రమాలతోపాటు సామాజిక తనిఖీలో అవకతవకలకు పాల్పడటంతో విచారణ జరిపి, సస్పెన్షన్ వేటు వేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇంటర్నేషనల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ


వరేణ్య

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీ బంగ్లాస్ ఏరియా క్వార్టర్‌లో నివాసం ఉంటున్న ఓసీపీ–1 అడిషనల్ మేనేజర్ బైరి రమేశ్ కుమార్తె వరేణ్య ఇంటర్నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ టెస్ట్‌లో పలు అంశాల్లో జరిగిన పరీక్షల్లో ప్రతిభ కనబరిచింది. ఆర్‌ఎఫ్‌సీఎల్ శ్రీ చైతన్య పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్న ఆమె ఐదోస్థానంలో నిలిచి, గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్‌తోపాటు ప్రత్యేక బహుమతి సాధించింది. ఈ సందర్భంగా వరేణ్యను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంఘాల సలహాదారుడు దయానంద్ గాంధీ మంగళవారం అభినందించారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



రామగుండం: ఓదెల మండల కేంద్రంలో మంగళవారం డ్రాగన్ కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. అంతర్గాం మండలంలోని పొట్యాల హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. అవినాష్, హర్షిత్, హఫీజ్, చేగువేరా, ఇందు, వర్షిత్‌లు గోల్డ్ మెడల్ సాధించగా, ప్రసన్న, అస్మా సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. పతకాలు సాధించిన విద్యార్థులందరూ జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యారని కరాటే మాస్టర్లు రామ్, లక్ష్మణ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సర్పంచ్ ఎదులాపురం నీరజ, బీఆర్‌ఎస్ నాయకుడు వెంకటేశ్, హెచ్ఎం వెంకటరమణ తదితరులు అభినందించారు.

బల్దియాలో విజిలెన్స్ భయం

- 40 రోజుల వ్యవధిలో రెండుసార్లు తనిఖీలు
- పలు విభాగాలపై అవినీతి ఆరోపణలు
- విచారణ జరిపిన అధికారులు
- ఫలితంగా ప్రత్యక్షమైన రెండు కొత్త వాహనాలు
- మరో రెండు రావాల్సి ఉంది


రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం



“ఈ చిత్రంలో కనిపిస్తున్న వాహనం పేరు జట్టింగ్ రాడ్ మెషీన్. ఏడాది క్రితం టీఎస్ ఆగ్రోస్ ద్వారా కొనుగోలు చేయడానికి బల్దియా అధికారులు ఓ కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించారు. కానీ ఏడాదిగా కనిపించని ఆ వాహనం సోమవారం రాత్రి బల్దియా కార్యాలయం వెనక ప్రత్యక్షమైంది. బల్దియా శానిటేషన్ విభాగం వాహనాల కొనుగోలులో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై ఇటీవల విజిలెన్స్ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. దీంతో సుమారు రూ.30 లక్షల విలువ చేసే కొత్త జట్టింగ్ రాడ్ మెషీన్ వాహనాన్ని హుటాహుటిన ఉత్తరాఖండ్‌ను తెప్పించారు.”



“ఈ వాహనం పేరు ట్రక్ మౌంటెడ్ గార్బేజ్ కంపాక్టర్. ఖరీదు సుమారు రూ.45 లక్షలు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.90 లక్షలతో రెండు వాహనాలను కొనుగోలు చేయడానికి 2020–21లో టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించారు. అధికారులు ఏడాది క్రితం వాహనాన్నే తెప్పించారు. ఇటీవల విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టడంతో ఖంగుతిన్నారు. కొందరు ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో ఈ నెల 17న రాత్రి కంపాక్టర్‌ను హుటాహుటిన తెప్పించడం గమనార్హం. ఇంకా రెండు కొత్త జేబీసీ, జాబ్ కార్డ్ మెషీన్(మినీ జేసీబీ) వాహనాలు రావాల్సి ఉంది. వీటికి కూడా ఏడాది క్రితమే అధికారులు బిల్లులు చెల్లించారు.”

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలోని పలు విభాగాల అధికారులకు విజిలెన్స్ భయం పట్టుకుంది. శానిటేషన్, హరితహారం, వాహనాల కొనుగోలు, ప్రకృతి వనాల అభివృద్ధి, నామినేషన్ పద్ధతిలో చేపట్టిన పనులు, స్క్రాప్ చోరీ జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులు తదితరాలతోపాటు ఇంజనీరింగ్ విభాగాలపై పలు అవినీతి, అక్రమాల ఆరోపణలు వచ్చాయి. వీటిపై పలువురు గతంలో విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదులు చేశారు. దీంతో గత నెల 17న విజిలెన్స్ సీఐ అనిల్‌కుమార్, డీఈ వినోద్ నేతృత్వంలోని బృందం బల్దియాలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, రికార్డులు పరిశీలించారు. ఇది మరవకముందే ఈ నెల 27న అదే బృందం మరోసారి విచారణ జరిపింది.

భయంతో వణుకుతున్న ఇంజినీర్లు

విజిలెన్స్ బృందం తనిఖీలు చేస్తుండటంతో ఇంజినీరింగ్ అధికారులు భయంతో వణికిపోతున్నారు. పలు డివిజన్లలో చేపట్టిన పనులకు ఇంజినీర్లు రికార్డులు తయారు చేసిన విధానంపై విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. అలాగే ఎన్టీపీసీ నిధులతో హరితహారం కింద నాటిన ఎవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. నాణ్యత లేకపోవడంతో కంపాక్టర్ బిన్స్ తుప్పు పట్టి, పనికి రాకుండా పోయాయని గుర్తించి, వివరాలు నమోదు చేసుకున్నారు. స్క్రాప్ చోరీ అయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటనపైనా ఆరా తీశారు.

కొత్త వాహనాలకు రిజిస్ట్రేషన్

ఏడాది తర్వాత బల్దియా కార్యాలయానికి తెప్పించిన కొత్త ట్రక్ మౌంటెడ్ గార్బేజ్ కంపాక్టర్, జట్టింగ్ రాడ్ మెషీన్ వాహనాలకు సంబంధిత కాంట్రాక్టర్ హుటాహుటిన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ చేయిస్తున్నారు. మంగళవారం ట్రక్ మౌంటెడ్ గార్బేజ్ కంపాక్టర్ వాహనానికి జిల్లా రవాణాశాఖ అధికారి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. బుధవారం మరో వాహనానికి చేయించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి

రామగిరి(మంథని): సెంటినరీకాలనీలో సింగరేణి కమ్యూనిటీ హాల్ వెనక నిర్మించిన నూతన పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని టీజీబీకేఎస్ యూనియన్ రెసిడెన్షియల్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వర్‌రావును కలిసి, వినతి పత్రం అందించారు. తెలంగాణ చౌరస్తా సమీపంలో ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయని, దుమ్ము లేస్తుండటంతో కార్మికులు, కార్మిక కుటుంబసభ్యులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే మరమ్మతు చేయించాలని కోరారు. రాణీ రుద్రమదేవి స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన జిమ్‌లో ఆధునిక పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. సెంటినరీకాలనీలోని సింగరేణి క్వార్టర్స్‌కు రంగులు వేయించాలని, మురికి కాలువలకు మరమ్మతు చేపట్టి, పైపులు వేయాలని విన్నవించారు. వీటన్నింటికీ జీఎం సానుకూలంగా స్పందించి, సివిల్ అధికారిని పిలిచి, పనులు త్వరగా చేయమని ఆదేశించారని తెలిపారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ కమిటీ సభ్యులు అల్లం తిరుపతి, అల్లంకి రామారావు, బత్తుల రమేశ్, బొడ్డు వినయ్ పాల్గొన్నారు.

చెత్త తొలగించాలి

సెంటినరీకాలనీలోని సింగరేణి క్వార్టర్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న చెట్లను కొట్టివేస్తున్న సిబ్బంది చెత్తను మాత్రం శుభ్రం చేయడం లేదని ఐఎన్టీయూసీ నాయకులు ఆరోపించారు. దీనివల్ల కార్మికులు, వారి కుటుంబసభ్యులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆర్జీ–3 జీఎం తన్నీరు వెంకటేశ్వర్‌రావును కలిసి, చెత్త తొలగించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రావు, తాళ్లపల్లి నారాయణ, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.


జీఎంకు వినతి పత్రం ఇస్తున్న రెసిడెన్షియల్ కమిటీ సభ్యులు

బీఎంఎస్ పోరాటం వల్లే సీఎంపీఎఫ్ ఆన్‌లైన్


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

రామగిరి(మంథని): బీఎంఎస్ పోరాటం వల్లే సీఎంపీఎఫ్ సేవలు జూన్ నుంచి ఆన్‌లైన్‌లో అమలవుతాయని సంఘం అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. మంగళవారం ఏఎల్పీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సీఎంపీఎఫ్ వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచాలని గతేడాది మార్చి 24న ఆందోళనలు చేపట్టామన్నారు. స్పందించిన సీఎంపీఎఫ్ కమిషనర్ ఈ ఏడాది మే వరకు ప్రక్రియను పూర్తి చేసి, జూన్ నుంచి అమలు చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయి ఉన్న రూ.25 వేల కోట్లను వెంటనే చెల్లించాలన్నారు. ప్రతీ కార్మికుడికి 250 గజాల భూమి, రూ.50 లక్షల వడ్డీ లేని రుణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఉపాధ్యక్షులు వై.సారంగపాణి, పొన్నమనేని వేణుగోపాల్‌రావు, కోశాధికారి మామిడి స్వామి, ఏరియా కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులు మాదాసు రవీందర్, మంచినీళ్ల స్వామి, వల్లెపు సురేష్, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేశ్, నాయకులు శ్రీనివాస్, బానోతు రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని టీచకపర్వం!

- సిబ్బంది నుంచి లేఖల కోసం బలవంతం
- వీడియోలు విడుదలైనా.. కాపాడేందుకు నేతల ప్రయత్నం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల మోడల్ స్కూల్ మాజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సస్పెండ్ అయినా.. తాను ఉత్తముడిని అంటూ నిరూపించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా ఉన్న శ్రీనివాస్ మహిళా సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న వీడియోలు విడుదలయ్యాయి. తమను పదేపదే వేధిస్తున్న శ్రీనివాస్ బండారాన్ని లోకానికి తెలిపేందుకు తోటి ఉద్యోగులే రహస్యంగా వీడియోలు తీశారు. ఈ వీడియోలు ‘సాక్షి’కి చేరడంతో వెంటనే కలెక్టర్ యాస్మిన్ బాషాకు చేరవేసింది. వీడియోలో శ్రీనివాస్ చర్యలు చూసి మండిపడ్డ కలెక్టర్ అతన్ని ఈనెల 16వ తేదీన సస్పెండ్ చేసిన విషయం విదితమే.

నేడు స్కూలుకు విచారణ కమిటీ..!

ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు బుధవారం విచారణ కమిటీ స్కూలుకు రానుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సస్పెండ్ అయిన శ్రీనివాస్ తాను ఉత్తముడని చెప్పుకునేందుకు ముందే ప్లాన్ వేశారు. మహిళా సిబ్బంది వద్దకు వెళ్లి.. శ్రీనివాస్ మంచోడు అంటూ స్వచ్ఛందంగా రాసి ఇచ్చినట్లుగా ముందే రాసిన లేఖలు వారికి ఇచ్చి వాటిపై సంతకాలు చేయించేందుకు యత్నించారు. ఈ ఘనకార్యానికి ఓ మహిళా ఉద్యోగి నేతృత్వం వహిస్తున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. పర్మినెంట్ ఉద్యోగులంతా ఆ లేఖలపై సంతకాలు చేయకుండా సున్నితంగా తిరస్కరించారు. అయినా.. పట్టువదలకుండా తాత్కాలిక సిబ్బందితో అవే లేఖలపై సంతకాలు చేయించుకున్నారని సమాచారం. ఈ లేఖలను బుధవారం స్కూల్‌కు విచారణకు వచ్చే కమిటీకి అందజేసేలా ప్లాన్ వేశారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. అదే సమయంలో విచారణ కమిటీతో నిందితుడు శ్రీనివాస్ కూడా రానున్నట్లు తెలిసి సిబ్బంది తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అతను ఎదురుగా ఉంటే విచారణ పారదర్శకంగా ఎలా జరుగుతుందన్న సందేహాలు లేవనెత్తుతున్నారు. మరో ఆసక్తికరమైన అంశమేంటంటే.. శ్రీనివాస్ ఉత్తముడు అంటూ లేఖలపై సంతకాలు పెట్టాల్సిందిగా ఓ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, మరో నలుగురైదుగురు చోటా లీడర్లు స్కూలు సిబ్బందిపై ఒత్తిడి తీసుకువస్తుండటాన్ని వారంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

అభివృద్ధిలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శం

- పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- రామగుండం ఎమ్మెల్యే చందర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


బైక్ ర్యాలీ తీస్తున్న ఎమ్మెల్యే చందర్, నాయకులు

జూలపల్లి(పెద్దపల్లి): సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జూలపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ మండల స్థాయి ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో విజయం సాధించి, పార్టీని మూడోసారి అధికారంలోకి తీసుకువచ్చే బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాయనడానికి రాష్ట్రానికి వచ్చిన అవార్డులే నిదర్శనమన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతీ కుటుంబానికి అందుతున్నాయని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రఘువీర్‌సింగ్ తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని పథకాలను ఇక్కడి పేద కుటుంబాలకు అందిస్తోందని ఎంపీపీ రమాదేవి పేర్కొన్నారు. సర్కారు అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు బొద్దుల లక్ష్మణ్ కోరారు. వైస్ ఎంపీపీ రమేశ్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కంది చొక్కారెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ వెంకటయ్య, సర్పంచులు నర్సింహయాదవ్, సంతోశ్‌రావు, మల్లేశం, ఎల్లయ్య, రాజయ్య, ఎంపీటీసీ సభ్యులు దండె వెంకటేశం, కత్తెర్ల శ్రీనివాస్, మల్లేశం యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

రామగుండం: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం అంతర్గాం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆత్మయ సమ్మేళనానికి ఆయన హాజరై, మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేందుకు అన్ని గ్రామాలను కలుపుతూ బైక్ ర్యాలీ నిర్వహించగా వందలాది మంది తరలివచ్చారు. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలతో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే అన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మన ఊరు–మన బడి, కేజీ టు పీజీ, దళితబంధు, గొర్రెలు, చేప పిల్లల పంపిణీ, రామగుండంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. బీజేపీవాళ్లు పదవుల కోసం రాజకీయం చేస్తారు తప్ప వారికి అభివృద్ధిపై ధ్యాస ఉండదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. అంతర్గాం ఎంపీపీ దుర్గం విజయ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు ఆముల నారాయణ, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు దివాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బానోతు తిరుపతినాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బాదరవేణి స్వామి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వార్డు సభ్యురాలి ఆత్మహత్య


శైలజ మృతదేహం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్ గ్రామ వార్డు సభ్యురాలు బొంకూరి శైలజ(30) ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన కూకట్ల కుమార్, అతని కుటుంబసభ్యులు విజయ్‌కుమార్, సంతోష్, రాకేశ్, స్వరూపలు శైలజను మానసికంగా ఇబ్బందులకు గురిచేశారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె మంగళవారం సాయంత్రం ఉరేసుకుంది. మృతురాలి తండ్రి బండ సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతురాలికి భర్త, కుమారుడు, కూతురు ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్ రాజీవ్‌నగర్(ఒడ్డెర కాలనీ)కు చెందిన జటపట అనిత(32) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందింది. బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనిత మంగళవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లి, ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడింది. తెల్లవారినా ఆమె ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, స్థానికులు సమీప ప్రాంతంలో వెతకగా బావిలో కనిపించింది. ఒడ్డుకు చేర్చి, పరిశీలించగా అప్పటికే మృతిచెందినది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మంథనిలో రెండుచోట్ల చోరీ

మంథని: స్థానికంగా నెల రోజుల క్రితమే వరుస దొంగతనాలు జరిగి, భారీగా సొత్తు అపహరణకు గురైంది. ప్రజలు ఇప్పుడిప్పుడే ఆ ఘటనల నుంచి తేరుకుంటున్న క్రమంలో తాజాగా మంగళవారం తెల్లవారుజామున మంథని పట్టణంలోని వీధుల్లో రెండు చోట్ల దొంగతనం జరిగింది. పూలే విగ్రహం ఏరియాలో చంద్రకాంత్ జువెల్లరీ షాపును ఇతర పనులు ఉండటంతో యాజమాని వెంకటస్వామి రెండు రోజులు తెరవలేదు. మంగళవారం తీసి చూడగా కౌంటర్ వద్ద సామగ్రి చిందరవందరగా పడి, వెనకవైపు తలుపు కట్ చేసి ఉంది. అనుమానం వచ్చి, దుకాణంలో పరిశీలించగా 36 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షలు కనిపించలేదు. సీసీ ఫుటేజీలో ముసుగు ధరించిన ఓ వ్యక్తి దొంగతనం చేస్తూ కనిపించాడు. అంతేకాకుండా నడివీధికి చెందిన గంగా జయప్రద 20 రోజుల క్రితం తన కూతురు ఇంటికి వెళ్లింది. మంగళవారం ఆమె ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు బాధితురాలికి సమాచారం ఇచ్చారు. ఆమె ఇంట్లోని 30 తులాల వెండి, మూడు తులాల బంగారు హారం చోరీకి గురయ్యాయని మంథని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. సంఘటన స్థలాలను ఆయనతోపాటు సీఐ సతీశ్ పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బొగ్గు సకాలంలో రవాణా చేస్తేనే లాభాలు

- ఆర్జీ–1 జీఎం కె.నారాయణ


కోల్ బంకర్‌ను ప్రారంభిస్తున్న జీఎం నారాయణ

గోదావరిఖని(రామగుండం): ఉత్పత్తి చేసిన బొగ్గును సకాలంలో రవాణా చేస్తేనే సింగరేణికి లాభాలు వస్తాయని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ అన్నారు. మంగళవారం జీడీకే–1, 3 గని వద్ద 45 టన్నుల బొగ్గు నిల్వచేసే సామర్థ్యం గల కోల్ బంకర్‌ను ఆయన ప్రారంభించారు. గ్రేడ్‌ల ప్రకారం బొగ్గు నిల్వ చేసేందుకు ఈ బంకర్‌ను నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, అధికారులు పొనగోటి శ్రీనివాస్, రామ్మోహన్, బానోతు సైదులు, రమేశ్‌బాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీకి తరలిరండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ముత్యంరావు

సుల్తానాబాద్: ఏప్రిల్ ఐదో తేదీన నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి తరలిరావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కరపత్రాలు ఆవిష్కరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని, ప్రభుత్వ రంగ సంస్థలు, వ్యవసాయాన్ని ప్రైవేటుశక్తులకు విక్రయిస్తోందని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు సీహెచ్.రామ్మూర్తి, ఎం.మల్లేశ్, నర్సింగం, ఎస్.లక్ష్మి, సురేష్, రాజయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

మెడికల్ బోర్డుకు నాలుగేళ్ల వరకు అనుమతించండి

- ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్


సింగరేణి సీఎండీ శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో అనారోగ్యంతో బాధపడుతూ మెడికల్ బోర్డుకు వెళ్లే కార్మికులకు ప్రస్తుతం ఉన్న రెండేళ్లను నాలుగేళ్ల సర్వీస్ వరకు అనుమతించాలని సంస్థ సీఅండ్ఎండీ ఎన్.శ్రీధర్‌ను ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. మంగళవారం సింగరేణి భవన్‌లో ఆయనను కలిసి, వినతి పత్రం అందజేశారు. నాలుగేళ్ల విధానం అమలైతే కార్మికులు మరోసారి మెడికల్ బోర్డుకు వెళ్లే అవకాశం లభిస్తుందన్నారు. బోర్డుకు వెళ్లే ప్రతి కార్మికున్ని మెడికల్ ఇన్‌వాలిడేషన్ చేయాలని కోరారు. ఫలితంగా దళారుల వ్యవస్థ రద్దవుతుందని పేర్కొన్నారు. కొన్ని రోజులుగా రామగుండం ప్రాంతంలో కలుషితమైన నీటి వల్ల కార్మిక కుటుంబాలు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నాయని తెలిపారు. శాశ్వత ప్రతిపాదికన సురక్షితమైన మంచినీరు అందించాలని విన్నవించారు. సింగరేణిలోని డిపెండెంట్ ఉద్యోగుల వయో పరిమితి 35 నుంచి 40 ఏళ్లకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల మార్పు వెంటనే అమలు చేయాలన్నారు. గోదావరిఖనిలో బీగెస్ట్‌హౌస్‌ను ఐటీపార్కుకు కేటాయించిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఉద్యోగుల సౌకర్యార్థం మరో గెస్ట్‌హౌస్ నిర్మించాలని పేర్కొన్నారు. సింగరేణి అనుబంధ సంస్థలు నెలకొల్పి, సంస్థ ప్రభావిత ప్రాంతాల వారి పిల్లలకు, ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. స్పందించిన సీఎండీ ఈ నెల 31న సింగరేణి బోర్డు మీటింగ్‌లో అనుమతి తీసుకొని, సమస్యలు పరిష్కరిస్తామన్నారని చెప్పారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య


మాట్లాడుతున్న యాకయ్య

జ్యోతినగర్(రామగుండం): రామగుండం కార్పొరేషన్ పరిధిలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బాధితులతో మాట్లాడారు. మేడిపల్లి శివారులోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న ప్రభుత్వ భూములను పేదల ఇళ్ల స్థలాల కోసం ఇవ్వాలంటూ పది రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం లేదని ఆరోపించారు. స్థానిక తహసీల్దార్, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించామన్నారు. ఇళ్ల కోసం పేదలు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. సీపీఎం ఆధ్వర్యంలో 15 ఎకరాల ప్రభుత్వ భూమిలో జెండాలను పాతి, పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించగా సర్వే చేయిస్తామని చెప్పారన్నారు. కానీ ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదని పేర్కొన్నారు. కొందరు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని, అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రామాచారి, భిక్షపతి, సారయ్య, ఉపేందర్, రమణ, నాగమణి, దేవక్క, శంకర్ తదితరులు పాల్గొన్నారు.